# స్వయం కృతం

దూరం నుంచి జైలు గంటలు మోగాయి.

డాడీ కారు స్టార్టు చేసారు. కారు జోరుగా వెళ్ళిపోయింది. టాటా చెబుతున్న మమ్మీ చేయి మెలమెల్లగా దూరమైంది. కారు రోడ్డు చివర మలుపు తిరిగి వెళ్ళిపోగానే బుజ్జికి ఏడుపొచ్చింది. ఇక రాత్రి దాకా మమ్మీ కనిపించదు.

ఆయా చేయి పుచ్చుకొని ఇంట్లోకి తీసుకెళ్ళింది. తలుపు వేసే-సింది.

కిటికి లోంచి చూశాడు బుజ్జి. వాడికి ఎదురుగా జైలు గోడలు కనిపించాయి. తెల్ల దుస్తులు వేసుకున్న ఖైదీలు తిరుగుతున్నారు.

విశాలమైన ఆ ఇల్లంతా తిరిగాడు బుజ్జి. వాడికి బోర్ కొట్టింది.

రోడ్డు మీద వాహనాల రాకపోకల శబ్దాలు వినబడుతున్నాయి. జనసమ్మర్దం పెరిగినట్లుంది. ఎప్పుడు ఇల్లు విడిచి బయటకి వెళ్ళని బుజ్జికి కుతూహలం కలిగింది రోడ్డు ఎలా ఉంటుందో అని.

అతి కష్టం మీద కిటికీ ఎక్కి చూశాడు. రోడ్డు బాగా రద్దీగా ఉంది. పక్కింటి బంటి వాళ్ళ నాన్న చేయి పట్టుకుని మెల్లగా నడిచి వేళ్తున్నాడు. వాడి నాన్న చెప్పే కబుర్లకి హాయిగా నవ్వుతున్నాడు.

ఆయా చూస్తే కొడుతుంది. భయం వేసింది. కిందకు దిగాడు. పక్కనే పంజరంలో కూర్చుని ఉన్న రామ చిలుక "బుజ్జీ! బుజ్జీ!" అని అరిచింది.

పరిగెత్తు కొచ్చింది ఆయా. కొన్ని బొమ్మలు వాడి ముందు పడే-సింది. కానీ వాడికి ఆడుకోవాలని అనిపించలేదు. ఎదురుగా ఉన్న షో కేసులోని బొమ్మలను చూస్తూ నిలుచున్నాడు.

"మురీ! మురీ! తాజా మురీ!" అన్న కేక వినిపించింది. మురీలు కొనుక్కు తింటే...?

మురీలు చాలా బావుంటాయుట. పక్కింటి లలిత చెప్పింది. ఓ

రోజు బుజ్జి ఇంటికి వచ్చినప్పుడు చాలా సంగతులు చెప్పింది లలిత. అది వూడా పార్క్ చూసిందట, జూకి వెళ్ళిందట. జూలో కోతులు, కుందేళ్ళు చాలా బావుంటాయట. వాళ్ళ మమ్మీ ఎప్పుడు లలితతోనే ఉంటుందట. అది విని బుజ్జిగాడికి ఉక్రోషం వచ్చింది.

వాడన్నాడు - "నాకు నా ఆయా ఉందిగా!"

"ఛీ! ఛీ! ఎవరికి కావాలి నీ బోడి గొప్ప ఆయా! మా మమ్మీ నాకు స్నానం చేయిస్తుంది. జడ వేస్తుంది. అన్నం కలిపి పెడు-తుంది. మరి మీ మమ్మీ ...?"

"మమ్మీ! మరి మా మమ్మీ ..."

ఆయా పంజరంలోని చిలుకకు అన్నం పెట్టింది.

జైలులో మళ్ళీ గంటలు మోగాయి.

భోజన సమయాన్ని గుర్తు చేసే ఆ గంట విని ఖైదీలంతా ఒక-చోట చేరారు.

గేటు దగ్గర ఆటో ఆగిన శబ్దం విని సంబరపడ్డాడు బుజ్జి. అమ్మ-మ్మగానీ వచ్చిందేమో?

కానీ అమ్మమ్మ రాదు కదా? మొన్ననే అమ్మమ్మ వచ్చినప్పుడు మమ్మీ అమ్మమ్మ గట్టిగా మాట్లాడుకున్నారు. వెంటనే అమ్మమ్మ వెళ్లిపోయింది.

మంచం మీద పడుకుని ఆలోచించాడు బుజ్జి. అమ్మమ్మ - మమ్మీ ఏం మాట్లాడుకున్నారు?

"ఏమే! వచ్చినప్పుడల్లా చూస్తున్నాను. నువ్వు ఇలా రోజంతా ఊరి మీద తిరుగుతుంటే బుజ్జిగాడిని ఎవరు చూస్తారు?"

"అందుకే కదమ్మా ఆయాని పెట్టింది" మమ్మీ

"ఆయా ఏం చేస్తుంది? అయినా నీ బిడ్డ ఆలనా పాలనా నువ్వు చూసుకోవాలి కానీ ... ?"

"నాకెలా కుదురుతుందమ్మా? నువ్వు చూస్తున్నావు కదా? పొద్దున్న లేచిన దగ్గర నుంచి ఒకటే ఎంగేజ్ మెంట్. విసుగొస్తోం

దనుకో!"

"తగ్గించుకోవచ్చు కదా? ఇదేమన్నా ఉద్యోగమా?"

"అదే నా బాధ కూడా ఉద్యోగమైతే మానేసే దాన్ని. ఇది అలా కాదుకదా! పొద్దున్న ఎనిమిది కల్లా వెళ్ళకపోతే అనాథ శరణాలయంలో పిల్లలు ఏమైపోతారు?" సంఘ సేవ చేసిందనే పేరుప్రఖ్యాతుల కోసం తాపత్రయ పడుతున్న ఆ సొసైటీ లేడీ ఇంకా ఏవేవో చెప్పింది.

"అయితే వాళ్ళ కోసం వీడిని అనాథగా వదులుతావా?"

"ఆయా ఉంది కదమ్మా?"

"ఇల్లు అలికిన తర్వాత వీధి అలకాలి." అమ్మమ్మకి కోపం వచ్చింది. ఆయాని పిలిచి ఆటో తెమ్మంది.

నిద్రలో బుజ్జికి కలొచ్చింది. అమ్మ వాడికి అన్నం కలిపి తినిపిస్తున్నట్లు

మెలకువ వచ్చేసరికి వాతావరణం చల్లబడింది. రోడ్డు మీద కూరలు అమ్మేవాళ్ళ కేకలు, ఆడుకుంటున్న పిల్లల అరుపులు వినిపిస్తున్నాయి.

మంచం దిగాడు బుజ్జి. ఆయా ఏం చేస్తోందో? హాలులోకి వచ్చిన బుజ్జి ఎగిరి గంతేశాడు. గుమ్మం తలుపులు తీసి ఉన్నాయి. గేటు తలుపు కూడా తీసే ఉంది.

రోడ్డు మీద నుంచి సోం పాపిడి బండి వెళ్ళింది. సోం పాపిడి తింటే ఎంత బాగుంటుందో?

మెల్లగా మెట్లు దిగాడు, గేటు దాటాడు. ఎంత బాగుంది ఈ లోకం అనుకున్నాడు. చల్లగా గాలి వీస్తోంది. సోం పాపిడి బండి వెనుక హాయిగా ఆనందంగా నడిచాడు. మెల్ల మెల్లగా రోడ్డు మలుపు దాటి వెళ్ళిపోయాడు.

వీధిలో కూరగాయలు కొంటున్న ఆడవాళ్ళు వాడిని ముద్దుగానూ, ఆశ్చర్యంగానూ చూస్తున్నారు.

బుజ్జి ఆగలేదు. ఏనాడూ లేని స్వేచ్ఛ, ఆనందం వాడికి కలిగాయి.

చాలా మంది చిన్నపిల్లలు వాళ్ళ మమ్మీల చేతులు పట్టుకుని రోడ్డు

మీద నడుస్తున్నారు. మరీ చిన్నపిల్లల్ని ఉయ్యాల ల్లాంటి బండిలో పడుకోబెట్టి తోసుకుంటూ వెడుతున్నారు.

దూరంగా ఐస్ క్రీం బళ్ళు కనిపిస్తున్నాయి.

నాలుగు రోడ్ల జంక్షన్ దగ్గరకు వచ్చేసరికి బుజ్జికి భయం వేసింది. ఎంత జనం! ఎన్ని కార్లు! ఎన్ని బస్సులు!

ఎటు వెళ్ళాలో తెలియక తికమక పడిపోయి నుంచున్నాడు బుజ్జి ఒక్క నిముషం.

దూరం నుంచి ఎర్రని మారుతీ కారు దూసుకొచ్చింది. కారుని ఆపాలని డ్రైవర్ బలంగా బ్రేకులు వేశాడు. కానీ కారు ఆగలేదు.

ఏక్సిడెంట్ కి గురయిన సూర్యుడు పశ్చిమ దిశన కొన ఊపిరితో పడిఉన్నాడు. వాడి చుట్టూ రక్త బిందువులు. ఎర్రని మబ్బులు.

కొంత దూరంలో కారుని ఆపగలిగారు జనం.

కారు డోర్ తెరచుకుని బయటకు వచ్చింది ఓ సొసైటీ లేడీ. చిన్న పిల్లలని, అనాథ శిశువులలాగా రోడ్ల మీదకు వదిలే తల్లితండ్రులని మనసులో తిట్టుకుంటూ.

నల్ల కళ్ళద్దాలు తీసి రక్తంలో మునిగి ఉన్న ఆ బాబుని చూసిందామె. కళ్ళు తిరిగిపోయాయి. లోకమంతా చీకటైపోయినట్లు అనిపించింది.

ఎదురుగా తన బాబు! బుజ్జి!

చనిపోయిన లోక బాంధవుని ఒళ్ళో పడి మూర్ఛపోయింది సంధ్య.

* * *

(ఆంధ్ర ప్రభ వారపత్రిక 28-11-90 సంచికలో ప్రచురితం)